క్లుప్తంగా

రోడ్డుపైనే కాన్వాయ్ పార్కింగ్



రోడ్డుపైనే నిలిపిన సత్యకుమార్ వాహనాలు

ధర్మవరం రూరల్: అత్యంత రద్దీగా ఉండే ధర్మవరం ప్రభుత్వాస్పత్రి వద్ద బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ కాన్వాయ్ వాహనాలు గంటపాటు రోడ్డుపైనే నిలిపేశారు. ఓబుళనాయనపల్లిలో మంగళవారం ఉదయం రెండు వర్గాల మధ్య చిన్నపాటి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో గాయపడిన లింగమయ్యను కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఈ అంశాన్ని రాజకీయంగా తనకు అనుకూలంగా మలచుకునేందుకు సత్యకుమార్ తన అనుచరులతో కలిసి బాధితుడిని పరామర్శించడానికని ప్రభుత్వాస్పత్రికి వచ్చాడు. అయితే తన కాన్వాయ్ వాహనాలను రోడ్డుపైనే నిలిపివేసి ఆస్పత్రిలోకి వెళ్లాడు. వాహనాలు అడ్డదిడ్డంగా నిలిపినందున ట్రాఫిక్ గంటపాటు స్తంభించి ప్రజలు ఇబ్బంది పడ్డారు.

స్పెషల్ ఫోర్స్ రూట్ మార్చ్



రూట్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ధర్మవరం అర్బన్: సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసిన సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ శ్రీనివాస్‌లు బీఎస్ఎఫ్ స్పెషల్ ఫోర్స్ పోలీసులు ధర్మవరంలో రూట్ మార్చ్ నిర్వహించారు. ప్రధాన రహదారిపైన అన్ని సర్కిళ్లలో రూట్ మార్చ్ సాగింది. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

పోలింగ్ పెరగడం ఆనందదాయకం

ఎన్‌పీకుంట: సాధారణ ఎన్నికల పోలింగ్‌లో ఓటింగ్ శాతం పెరగడం ఆనందదాయకమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బాలకృష్ణ నాయుడు తెలిపారు. సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ఆయన పాపన్నగారిపల్లిలోని నివాసంలో విలేకరులతో మాట్లాడారు. అత్యధిక శాతం ఓటింగ్ నమోదు నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకోబోతోందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, నాయకులు వెంకటరామిరెడ్డి, రామచంద్ర, కరుణాకర్‌రెడ్డి, నాగిరెడ్డి, విజయారెడ్డి, రాజారెడ్డి, మాధవరెడ్డి, మాజీఎంపీపీ సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

తాడిమర్రి: గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ముదిగుబ్బ రూరల్ సీఐ కృష్ణంరాజు నాయక్ హెచ్చరించారు. మండలంలోని శివంపల్లి, ఆత్మకూరు, నిడిగల్లు, నార్సింపల్లి, పూలఓబయ్యపల్లి గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఆయన ఎస్ఐ నాగస్వామితో కలసి పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో సీఐ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా చిన్న కారణాలతో కక్షలు పెంచుకుని వివాదాలు, ఘర్షణలకు పాల్పడకూడదని సూచించారు. గ్రామస్తులందరూ అన్నదమ్ముల వలే కలసిమెలసి జీవించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు వన్నప్ప, సూర్యనారాయణరాజు, హెచ్‌సీలు నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

ధర్మవరం రూరల్: ఓబుళనాయనపల్లిలో మంగళవారం ఉదయం ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. సోమవారం పోలింగ్ కేంద్రాల వద్ద చోటు చేసుకున్న వివాదం చినికి చినికి మంగళవారం ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో లింగమయ్య అనే వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు సకాలంలో గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

కార్యకర్తకు పరామర్శ



నాగేంద్రను పరామర్శిస్తున్న శ్రీధర్‌రెడ్డి

ఓడీ చెరువు: కుసుమవారిపల్లిలో సోమవారం పోలింగ్ సందర్భంగా టీడీపీ గూండాల దాడిలో కత్తిపోట్లకు గురై తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త, డీలర్ నాగేంద్ర (ఇంద్రప్ప), అతని భార్య నాగలక్ష్మిని మంగళవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పరామర్శించారు. అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగేంద్రను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఎమ్మెల్యే వెంట ఆయన తనయుడు దుద్దుకుంట కిషన్‌రెడ్డి, జెడ్పీటీసీ కుర్లి దామోదర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజునాయుడు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ లక్ష్మిరెడ్డి తదితరులు ఉన్నారు.

కదిరిలో రికార్డుస్థాయి పోలింగ్

- 81.36 శాతం పోలింగ్ నమోదు



కదిరి నియోజకవర్గ మ్యాప్



కుటాగుళ్లలో ఓటువేసేందుకు పెద్ద సంఖ్యలో బారులు తీరిన ఓటర్లు

కదిరి: కదిరి నియోజకవర్గంలో రికార్డుస్థాయి పోలింగ్ నమోదైంది. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 81.36 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2,53,420 మంది ఓటర్లు ఉండగా వీరిలో 2,06,205 మంది ఓటు వేశారు. పురుష ఓటర్లు 1,24,650 మంది ఉండగా వీరిలో 1,02,409 మంది, మహిళా ఓటర్లు 1,28,762 మంది ఉండగా వీరిలో 1,03,789 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు కదిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సన్నీ వంశీకృష్ణ తెలిపారు. ట్రాన్స్‌జెండర్స్(హిజ్రాలు) 8 మంది ఉంటే వీరిలో ఏడుగురు ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ ఇంత భారీ స్థాయిలో ఓటు హక్కు వినియోగించుకున్న దాఖలాలు లేవు.

2019 ఎన్నికల్లో 79.95 శాతం

2019 సార్వత్రిక ఎన్నికల్లో కదిరి నియోజకవర్గంలో 79.95 శాతం పోలింగ్ నమోదైంది. అప్పట్లో నియోజకవర్గ వ్యాప్తంగా 2,39,867 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,91,762 మంది(79.95 శాతం)ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అప్పట్లో పురుష ఓటర్లు 1,19,615 మంది ఉండగా వీరిలో 96,520 మంది(80.69శాతం), మహిళా ఓటర్లు 1,20,243 మంది ఉంటే వీరిలో 95,239 మంది (79.21శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. అప్పట్లో ట్రాన్స్‌జెండర్స్(హిజ్రాలు) 9 మంది ఉండగా ముగ్గురు మాత్రమే ఓటు వేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. గతంతో పోలిస్తే ఈ ఎన్నికల్లో ట్రాన్స్‌జెండర్లు 8 మందికి గాను ఏడుగురు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారంటే వారిలో చైతన్యం వచ్చినట్లే.

2014లో 74.90 శాతం పోలింగ్

2014 సార్వత్రిక ఎన్నికల్లో కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా 74.90 శాతం ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఐదేళ్లకోసారి జరిగే ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు పెరగటంతో పాటు పోలింగ్ శాతం కూడా బాగా పెరుగుతోంది. పోలింగ్ నాడు ఓటు వేసేందుకు గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చున్నారంటే ఓటర్ల జాబితాలో ఓటుహక్కు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరూ కచ్చితంగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలనే దృఢ సంకల్పం స్పష్టంగా కనబడుతోంది.

గెలుపుపై ఎవరి ధీమా వారిది

ఈసారి ఎన్నికల్లో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదు కావడంతో రాజకీయ పార్టీల నాయకులు ఎవరికి వారు తమకు అనుకూలంగా చెప్పుకుంటున్నారు. ముఖ్యంగా మహిళా ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరడంతో చంద్రబాబు మహిళలకు ఇచ్చిన హామీలకు ఆశపడి మహిళలు ఓటింగ్‌కు పోటెత్తారని, అందుకే తప్పకుండా టీడీపీనే గెలుస్తుందని ఆ పార్టీ నాయకులు చెప్పుకుంటున్నారు.

- జగనన్న ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ల ద్వారా అవ్వాతాతలకు ఇంటి దగ్గరకే వచ్చి పింఛన్ ఇస్తున్నందున వారంతా తమ పార్టీ వైపు మొగ్గు చూపారని వైఎస్సార్‌సీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పక్కా ఇల్లు మంజూరు చేసినా, రేషన్ కార్డు మంజూరు చేసినా మహిళల పేరు మీదనే ఇచ్చారని, అమ్మ ఒడి పథకంతో పాటు ఇంకా ఎన్నో పథకాలకు సంబంధించిన నగదు నేరుగా అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాలోనే జమ చేశారని, అందుకే వారంతా జగనన్నకు జై కొడుతూ ఫ్యాను గుర్తుకు ఓటు వేశారని వైఎస్సార్‌సీపీ నాయకులు చెబుతున్నారు. కచ్చితంగా కదిరిలో పెద్ద మెజార్టీతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బి.ఎస్.మక్బూల్ అహ్మద్ గెలవడం ఖాయమని వైఎస్సార్‌సీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గెలిచేది ఎవరనేది తేలాలంటే జూన్ 4వ తేదీ వరకూ వేచి చూడాల్సిందే.

ఫ్యానుకు సానుకూలమే!

- పుట్టపర్తిలో స్పష్టం చేస్తున్న పోలింగ్ సరళి

పుట్టపర్తి: సాధారణ ఎన్నికల్లో కనీవినీ ఎరుగని రీతిలో పోలింగ్ శాతం నమోదైంది. పుట్టపర్తి నియోజకవర్గంలోని పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు, అమడగూరు, నల్లమాడ, ఓడీ చెరువు మండలాల్లో సోమవారం జరిగిన పోలింగ్‌కు ఓటర్లు పోటెత్తారు. నియోజకవర్గ వ్యాప్తంగా 86.2 శాతం పోలింగ్ నమోదైంది. 1,81,500 మంది ఓటు హక్కు వినియోగించుకోగా.. అందులో 90 వేల మంది పురుషులు, 91,500 మంది మహిళలు ఉన్నారు. గడిచిన ఐదేళ్లలో ప్రతి పథకంలోనూ మహిళలకు పెద్దపీట వేసినందున వారంతా వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఓటు వేశారని పోలింగ్ సరళిని బట్టి తెలుస్తోందని ఆ పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థికసాయం

గాండ్లపెంట: నల్లగుట్టతండాకు చెందిన నాగేష్ నాయక్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకునేందుకు డబ్బు లేక ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయాన్ని సోమాలగొంది ఎంపీటీసీ లక్ష్మీదేవి భర్త గోపాల్‌నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా నాగేష్‌నాయక్‌కు రూ.15వేల ఆర్థికసాయం అందించారని ఎంపీటీసీ మంగళవారం తెలిపారు.

కాలువలోకి కారు బోల్తా

కదిరి: పట్టణంలోని సైదాపురం అంజనేయస్వామి గుడి వద్ద మంగళవారం ఎన్‌జీఓ కాలనీకి వెళ్లే దారిలో కారు అదుపుతప్పి కాలువలోకి బోల్తాపడింది. కారు నడుపుతున్న విష్ణు ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించే క్రమంలో అదుపుతప్పాడు. కారు పక్కనే ఉన్న కాలువలోకి బోల్తాపడింది. అయితే విష్ణుకు ఏమీ కాలేదు.

రాప్తాడులో వెల్లువెత్తిన ఓటరు చైతన్యం

- నియోజకవర్గంలో 85.08 శాతం ఓటింగ్ నమోదు
- రామగిరిలో అత్యధికంగా 90.49 శాతం పోలింగ్



కనగానపల్లిలో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన మహిళా ఓటర్లు, యువకులు

కనగానపల్లి: రాప్తాడు నియోజక వర్గంలో ఓటర్ల చైతన్యం వెల్లువెత్తింది. సార్వత్రిక ఎన్నికల్లో 85.08 శాతం పోలింగ్ నమోదైంది. నియోజక వర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 279 పోలింగ్ స్టేషన్లు ఉండగా, అందులో 2,50,571 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,13,207 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. అధికారులు. దీంతో గత 2019 ఎన్నికల కన్నా సుమారు 10 వేల(3 శాతం) మంది ఎక్కువగా ఓట్లు వేశారు. సమస్యాత్మక ప్రాంతమైన రామగిరి మండలంలో అత్యధికంగా 90.49 శాతం ఓటింగ్ నమోదైంది. ఇక నియోజకవర్గంలో అత్యధికంగా ఓటర్లు ఉన్న అనంతపురం రూరల్ మండలం మాత్రం 77.53 శాతం మంది మాత్రమే ఓట్లు వేశారు. ఈ ఎన్నికల్లో ఎక్కువగా మహిళలు, వృద్ధులు, యువకులు ఉత్సాహంగా పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఓటర్లు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులుదీరారు. దీంతో ఓటింగ్ నమోదు విషయంపై అధికారులు సకాలంలో సరైన సమాచారం అందించలేకపోయారు.

రాప్తాడు నియోజ వర్గంలో మండలాల వారిగా పోలింగ్

మండలం	మొత్తం ఓటర్లు	పోలైన ఓటర్లు	ఓటింగ్ శాతం
ఆత్మకూరు	33,227	30,010	90.31
అనంత పురంరూరల్	81,451	63,156	77.53
రాప్తాడు	35,493	30,113	84.84
కనగానపల్లి	33,771	30,356	89.88
రామగిరి	29,396	26,602	90.49
చెన్నేకొత్తపల్లి	37,233	32,970	88.55
మొత్తం	2,50,571	2,13,207	85.08

ధర్మవరంలో 88.83 శాతం పోలింగ్



సోమవారం ధర్మవరం బాలికోన్నత ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రం వద్ద పోటెత్తిన ఓటర్లు

ధర్మవరం అర్బన్: ధర్మవరం నియోజకవర్గంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 88.83 శాతం పోలింగ్ నమోదైందని రిటర్నింగ్ అధికారి వెంకట శివరామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 1,21,764 మంది పురుషులు, 1,23,974 మంది మహిళలు ఓటు హక్కు ఉపయోగించుకున్నారని పేర్కొన్నారు. ధర్మవరం టౌన్‌లో పురుషులు 45,898, మహిళలు 46,882 మంది ఓటు వేయడంతో 88.05 శాతం నమోదైందని, రూరల్ పరిధిలో 16,144 మంది పురుషులు, 15,896 మంది మహిళలు మొత్తం 32,041 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 92.71శాతం నమోదైందని వివరించారు. తాడిమర్రి మండలంలో 11,764 మంది పురుషులు, 11,552 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకోగా 91.26శాతం నమోదైందని తెలిపారు. ముదిగుబ్బ మండలంలో 20,813 మంది పురుషులు, 20,596 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకోగా 86.99శాతం నమోదైందని పేర్కొన్నారు. బత్తలపల్లి మండలంలో 14,391 మంది పురుషులు, 14,346 మంది మహిళలు ఓటు వేయగా 87.99శాతం నమోదైందని రిటర్నింగ్ అధికారి వెల్లడించారు.

సైకిల్ గల్లంతు ఖాయం

- మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభంజనమే
- కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి
- పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి



సమావేశానికి హాజరైన ఏజెంట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు

పుట్టపర్తి: సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనానికి సైకిల్ గల్లంతు కావడం ఖాయమని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఓట్ల లెక్కింపు రోజు ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన మంగళవారం పుట్టపర్తిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని పోలింగ్ ఏజెంట్లు, నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వైఎస్సార్‌సీపీ జోరు కనిపించిందన్నారు.

అందరికీ కృతజ్ఞతలు

నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం ఓటింగ్‌లో పాల్గొన్న అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, అన్నదమ్ముళ్లు, ముఖ్యంగా పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాబోతున్నారని, ప్రజలకు మరింత మేలు జరగనుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా, దౌర్జన్యాలకు ఉసిగొల్పినా పార్టీ శ్రేణులు వెనక్కు తగ్గకుండా పోలింగ్ సజావుగా సాగేలా కృషి చేశాయని, వారి సేవలను గుర్తించి న్యాయం చేస్తామని చెప్పారు.

కురుబ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణ, మండల పరిధిలోని కురుబ విద్యార్థినీ విద్యార్థులకు ప్రోత్సాహక ప్రతిభా పురస్కారాలు అందించనున్నామని కురుబ సంక్షేమ సంఘం, కురుబ యువజన ఉద్యోగుల సంఘం, కురుబ కల్యాణమండపం కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో 500కు పైగా మార్కులు, ఇంటర్‌లో 900కుపైగా మార్కులు సాధించిన కురుబ విద్యార్థులు ప్రోత్సాహక ప్రతిభా పురస్కారాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 22 లోపు కురుబ కల్యాణ మండపంలో కుల ధ్రువీకరణపత్రం, మార్కుల జాబితాతో దరఖాస్తును అందించాలన్నారు. పూర్తి వివరాల కోసం 94408 08732, 99083 87330, 93938 88939, 94900 89523 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కోర్కెలు తీర్చే లక్ష్మీచెన్నకేశవుడు

- నేటి నుంచి లక్ష్మీచెన్నకేశవుని బ్రహ్మోత్సవాలు
- 21న బ్రహ్మ రథోత్సవం



శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం

ధర్మవరం అర్బన్: కోరిన కోర్కెలు తీర్చే లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వైశాఖ శుక్ల సప్తమి నుంచి బహుళ విదియ వరకు అనగా 11రోజులపాటు అంగరంగ వైభవంగా ఉత్సవాలు సాగనున్నాయి. 15వ తేదీన ధ్వజారోహణం, 16న ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనంలో స్వామి ఊరేగుతారు. 17న ఉదయం సర్వభూపాల వాహనం, సాయంత్రం సింహ వాహనం, 18న ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం హనుమద్వాహనం, 19న ఉదయం పల్లకీ ఉత్సవం, సాయంత్రం లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. 20న ఉదయం శేష వాహనం, సాయంత్రం గజ వాహనంలో స్వామి ఉత్సవమూర్తులు ఊరేగింపు నిర్వహిస్తారు. 21న ఉదయం 7గంటలకు మడుగుతేరు(బ్రహ్మరథోత్సవం) లాగుతారు. అనంతరం సాయంత్రం వరకు స్వామిని దర్శించుకునే అవకాశం కల్పిస్తారు. సాయంత్రం 4గంటలకు బ్రహ్మ రథోత్సవాన్ని లాగుతారు. సాయంత్రం 6గంటలకు ధూలోత్సవం నిర్వహిస్తారు. 22న సాయంత్రం అశ్వవాహనం, 23న ఉదయం పుష్ప మండపం, 10గంటలకు వసంతోత్సవం, సాయంత్రం 6గంటలకు హంస వాహనంలో స్వామి కొలువుదీరుతారు. 24న సాయంత్రం దేవతా ఉద్వాసన, 25న ఉదయం పుష్పయాగం, సాయంత్రం శయనోత్సవం(ఏకాంత సేవ) నిర్వహించడంతో ఉత్సవాలు ముగుస్తాయి. రథోత్సవాన్ని తిలకించేందుకు ధర్మవరం నుంచే కాకుండా జిల్లాలోని అన్ని ప్రాంతాల ప్రజలు, బెంగళూరు, హైదరాబాద్, కర్నూలు, కడప తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. రథోత్సవం అనంతరం మరుసటి రోజు నుంచి మూడురోజుల పాటు గ్రామ దేవత దుర్గమ్మ పరుష వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి మూలవిరాట్


ఆలయ ప్రాశస్త్యం

ధర్మవరం పట్టణంలో క్రీ.శ.950 సంవత్సరంలో కీవక మహామునీశ్వరుడు ఉదయాద్రి మీద తపస్సు చేసి హంపి నుంచి శ్రీ చెన్నకేశవస్వామి మూలవిరాట్ తీసుకొచ్చి ఇక్కడ ప్రతిష్ఠించాడని చరిత్ర చెబుతోంది. అనంతరం పాలించిన హరిహర బుక్కరాయలు పాలనలో సామంతరాజులు శ్రీ క్రియాశక్తి వడయార్ ధర్మవరంలో చెరువు తవ్వించాడు. రామగిరి మండలం కుంటిమద్ది వద్ద ఓ రైతు పొలం దున్నే సమయంలో భూమిలో శ్రీ భూనీల సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలు దొరికాయి. క్రియాశక్తి వడియార్‌కు కలలో స్వామి కనిపించి మమ్ములను ధర్మాంబపురం (ప్రస్తుతం ధర్మవరం) ఆలయంలో ప్రతిష్ఠించాలని చెప్పాడట. అదే మహాభాగ్యమని భావించి అక్కడి నుంచి ఉత్సవ విగ్రహాలు తీసుకొచ్చి తూర్పు దిశగా బ్రాహ్మణవీధిలో లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో విగ్రహాలు ప్రతిష్ఠించారు. దేవాలయం ఏర్పడిన ప్పటి నుంచి అర్చకత్వం వంశపారంపర్యంగా రావడం ఇక్కడి ఆనవాయితీ. ప్రస్తుతం ప్రధాన అర్చకులు కోనేరాచార్యులు, అర్చకులు మకరందబాబు, భానుప్రకాష్ పూజలు చేస్తున్నారు. 2013లో దాతలు, టీటీడీ సహకారంతో రూ.60 లక్షలు వెచ్చించి దేవాలయం జీర్ణోద్ధారణ గావించారు. వివాహాలు చేసేందుకు కల్యాణమండపం నిర్మించారు.

స్వామి పాదాలు తాకే సూర్యకిరణాలు...

ఏటా మాఘమాసంలో మొదటిరోజు చెన్నకేశవస్వామి మూలవిరాట్ పాదాలను సూర్యకిరణాలు తాకుతాయి. రెండోరోజు స్వామి దేహానికి, మూడోరోజు మూలవిరాట్ మొత్తం సూర్యకిరణాలు తాకుతాయి. సంవత్సరంలో మిగతా ఏ రోజుల్లోనూ సూర్యకిరణాలు స్వామిని తాకవు. ధనుర్మాసంలో నెలరోజులపాటు స్వామికి ప్రత్యేక పూజలు చేస్తారు. వైకుంఠ ఏకాదశికి స్వామిని దక్షిణ ద్వారం, ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిస్తారు.

రథోత్సవానికి తరలిరండి



ధర్మవరంలో నిర్వహించే లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవాన్ని తిలకించి స్వామి ఆశీస్సులు పొందండి. కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా ప్రసిద్ధిగాంచిన చెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను ప్రతిరోజూ చూస్తే మంచిది. వెయ్యి సంవత్సరాల కిందట నిర్మించిన దేవాలయం కావడంతో భక్తులు దర్శించుకుని సుఖశాంతులతో జీవించండి. దాతల సహకారంతో సింహ వాహనం, అశ్వ వాహనం, గరుడ వాహనం, హనుమద్వాహనం, కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, గజ వాహనం ఇలా 7 రకాల వాహనాలను కొత్తగా తయారు చేయించాం. ఆ వాహనాల్లో స్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించనున్నాం.

– దాశెట్టి సుబ్రహ్మణ్యం, లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ కమిటీ చైర్మన్